

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ: డీఎంహెచ్‌వో

పార్వతీపురం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్టు డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు తెలిపారు. శనివారం తన కార్యాలయం నుంచి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా వైద్యాధికారులు, 108 సిబ్బందితో సమీక్షించారు డీహైడ్రేషన్, వడదెబ్బపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. పారా మెడికల్, క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ ఇవ్వాలన్నారు. కోల్డ్ ఐస్‌ప్యాక్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్లకు కొరత లేకుండా చూసుకోవాలని, టీకా కార్యక్రమాన్ని ఉదయం వేళ త్వరగా ప్రారంభించాలని సూచించారు. చిన్నారులు, గర్భిణులు, వృద్ధులు, దీర్ఘకాలిక రోగుల ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలన్నారు.

కొత్తదనానికి నాంది.. ఉగాది

తెలుగు సంవత్సరాది ఉగాది వచ్చేసింది. కొత్తదనాన్ని తెచ్చేసింది. మామిడి తోరణాలతో ఇళ్లను అలంకరించి.. ముంగిళ్లను రంగవల్లులతో ముస్తాబు చేసి.. సంప్రదాయ వస్త్రధారణలో కనువిందు చేసేందుకు చిన్నా.. పెద్ద సిద్ధమయ్యారు. షడ్రుచుల సమ్మేళనంతో చేసే పచ్చడిని రుచి చూడనున్నారు. పంచాంగ శ్రవణంతో తిథి, వార ఫలితాలు తెలుసుకోవాలని ఉవ్విళ్లూరుతున్నారు. ఇదే రోజు ఇష్ట దైవాన్ని దర్శించుకుని పూజలు చేస్తుంటారు. అన్నదాతలు ఏరువాకతో ఖరీఫ్ పనులకు శ్రీకారం చుట్టడం ఆనవాయితీగా వస్తోంది. ఉగాదిని ప్రభుత్వం రాష్ట్ర పండుగగా నిర్వహించాలని తలపెట్టింది. ఈ మేరకు ఆదివారం ఉదయం 8.30 గంటలకు అన్ని చోట్లా అధికారికంగా విశ్వావసు నామ సంవత్సర వేడుకలు ప్రారంభమవుతాయి. కాగా శనివారం జిల్లాలోని ప్రధాన మార్కెట్లు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. ఉగాది పచ్చడిలో ఉపయోగించే సరుకుల (బెల్లం, ఉప్పు, వేపపువ్వు, చింతపండు, మామిడికాయలు, మిరపకాయలు)ను అందరూ విరివిగా కొనుగోలు చేశారు. పూలు, కొబ్బరికాయల ధరలు అమాంతం పెరిగిపోయాయి.





- పూర్తి వివరాలు 8వ పేజీలో..

సంబరంగా..

- టీడీపీ వ్యవస్థాపక దినోత్సవం
- ఉత్సాహంగా పాల్గొన్న శ్రేణులు
- ఎన్టీఆర్‌కు ఘన నివాళి

పార్వతీపురం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో శనివారం టీడీపీ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఎంతో ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. వాడవాడలా ఎన్టీఆర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. పార్టీ కార్యాలయాల వద్ద టీడీపీ జెండా ఎగురవేశారు. కేకులు కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. సీనియర్ నేతలను సత్కరించారు.

ఎన్టీఆర్ ఆశయ సాధనకు కృషి: మంత్రి

సాలూరు: టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పిలుపునిచ్చారు. సాలూరులోని తన క్యాంపు కార్యాలయంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం శ్రేణులతో కలిసి ర్యాలీగా ఎన్టీఆర్ విగ్రహం వద్దకు వెళ్లారు. గజమాలను వేసి నివాళి అర్పించారు. సమాజమే దేవాలయం..ప్రజలే దేవుళ్లు అనే నినాదంతో ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారని, తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి వచ్చి రికార్డు నెలకొల్పారని తెలిపారు. పేదలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత ఆయనకు దక్కుతుందన్నారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పనిచేస్తున్నారని తెలిపారు. అనంతరం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్పీ భంజ్‌దేవ్ మాట్లాడుతూ తెలుగువాడి ఆత్మగౌరవాన్ని ఢిల్లీలో నిలబెట్టిన మహానుభావుడని కొనియాడారు. అనంతరం మంత్రి క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేశారు. పార్టీ శ్రేణులకు మిఠాయిలు పంచి పెట్టారు. 43 మంది సీనియర్ టీడీపీ నాయకులు, కార్యకర్తలను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఆ తర్వాత మంత్రి సంధ్యారాణి సాలూరు ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, నాయకులు వేణు గోపాల నాయుడు, పరమేష్, వెంకట రమణ, శోభారాణి, అప్పయమ్మ, కౌన్సిలర్లు వైదేహి, హర్ష, పాంచాలి సర్పంచ్ యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా టీడీపీ: ప్రభుత్వ విప్

కురుపాం: పేద, బడుగు, బలహీన వర్గాలకు టీడీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి తెలిపారు. కురుపాంలో టీడీపీ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పార్టీ జెండా ఎగురవేశారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పార్టీ కోసం అహర్నిశలు పనిచేసిన సీనియర్ నాయకులు బిడ్డిక కడాయి, గుడ్ల కోటి, ఆనంద్, రామారావు, బి.లక్ష్మణ్, కిమిడి వెంకటరావును సన్మానించారు. పార్టీ అభివృద్ధిపై రూపొందించిన వీడియోను నాయకులు, కార్యకర్తలతో కలిసి వీక్షించారు. ఈ కార్యక్రమంలో ట్రైకార్ బోర్డు డైరెక్టర్ పి.లావణ్య, ఏఎంసీ చైర్ పర్సన్ కళావతి, మండల కన్వీనర్ కొండయ్య, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న మంత్రి సంధ్యారాణి, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భంజ్‌దేవ్ తదితరులు



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

మాదకద్రవ్యాల నియంత్రణకు చర్యలు

- డ్రోన్లను విస్తృతంగా వినియోగించాలి: కలెక్టర్

పార్వతీపురం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణకు డ్రోన్లు వినియోగించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో మాదక ద్రవ్యాల నియంత్రణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాటుసారా, మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా పార్వతీపురం మన్యం ఉండాలన్నారు. అసైన్డ్ భూముల్లో ఎవరైనా నాటుసారా తయారు చేస్తే పట్టాలు రద్దు చేస్తామన్నారు. నవోదయం కార్యక్రమం ద్వారా పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని ఎక్సైజ్‌శాఖను ఆదేశించారు. మెడికల్ షాపుల్లో వివిధ రూపాల్లో మందుల విక్ర యాలు, కాలం చెల్లిన మందులు ఉన్నట్లు తెలిస్తే క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో గత నెల 288 కిలోల గంజాయిను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. 394 పాఠశాలలు, కళాశాలల్లో ఈగల్ క్లబ్‌లు ఏర్పాటు చేశామన్నారు. రోజూ డ్రోన్ ద్వారా పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. జిల్లా డ్రగ్స్ కంట్రోల్ అధికారి డి.ఆశ మాట్లాడుతూ.. పట్టణంలో నాలుగు మందుల దుకాణాలపై దాడులు నిర్వహించామని, మూడు షాపుల లైసెన్స్‌లు రద్దు చేశామని వెల్లడించారు. జిల్లా ఎక్సైజ్ అధికారి శ్రీనాథుడు మాట్లాడుతూ.. నవోదయం కింద జిల్లాలో 137 గ్రామాలను గుర్తించామన్నారు. 168 గ్రామాల్లో అవగాహనా కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ఏఎస్పీ అంకితసురానా, డిప్యూటీ కలెక్టర్ ధర్మచంద్రారెడ్డి, పాలకొండ డీఎస్పీ రాంబాబు, డీఎఫ్‌వో ప్రసూన తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

పింఛన్ల పంపిణీకి అధునాతన పరికరాలు

- ఎల్ 1 స్కానర్లను అందజేసిన ప్రభుత్వం
- వేలిముద్ర కష్టాలకు చెక్.. లబ్ధిదారులకు తప్పనున్న ఇక్కట్లు

కొమరాడ, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లలో ఎటువంటి అవకతవకలు, ఇబ్బందులు తలెత్తకుండా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. దీనిలో భాగంగా ఆధునీకీకరించిన ఎల్1 స్కానర్లను గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి అందజేసింది. వాటి సాయంతో ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి త్వరగా పింఛన్ సొమ్ము పంపిణీ చేయడానికి వెసులబాటు కలుగుతుంది. కొత్త స్కానర్ల వినియోగంపై అధికారులు ఇప్పటికే సిబ్బందికి అవగాహన కల్పించారు. వాస్తవంగా వివిధ రకాల సామాజిక పింఛన్ల పంపిణీ, సర్వేలు నిర్వహించేటప్పుడు లబ్ధిదారుల వేలిముద్రల నమోదుకు సచివాలయ సిబ్బంది నానా ఇబ్బందులు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన ఎల్‌జీ స్కానర్లు సరిగ్గా పనిచేయడం లేదు. దీంతో వేలిముద్రలు సరిగా పడక లబ్ధిదారులూ ఇక్కట్ల పాలవుతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్రం సూచనలతో రాష్ట్ర ప్రభుత్వం ఎల్1 ఆర్‌డీ పరికరాలను కొనుగోలు చేసి గ్రామ, వార్డు సచివాలయాలకు సరఫరా చేసింది. కాగా ఈనెల 31 తరువాత పాత స్కానర్లు పనిచేయవు. కొత్తగా సరఫరా చేసిన ఎల్1 ఆర్‌డీ స్కానర్లతోనే ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ, పి4 (పబ్లిక్ ప్రైవేట్ పీపుల్స్ పార్టనర్‌షిప్), వర్క్ ఫ్రం హోం, హౌస్ హోల్డ్, జియో ట్యాగింగ్, పీజీఆర్ఎస్‌పీడీ బ్యాక్, తదితర సర్వేలకు వినియోగించనున్నారు. ఎక్కడైనా ఈ స్కానర్లు పనిచేయకుంటే వాటి స్థానంలో కొత్తవి ఇచ్చేలా ప్రణాళిక రూపొందించారు. కాగా భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) ఆధార్ సాఫ్ట్‌వేర్‌తో దానిని అనుసంధానం చేశారు. జిల్లాలో 15 మండలాలు, రెండు మున్సిపాల్టీలు, ఒక నగర పంచాయతీలో మొత్తంగా 1,39,908 మంది పింఛన్‌దారులు ఉన్నారు. వారికి ఎన్టీఆర్ భరోసా కింద ప్రతినెలా ప్రభుత్వం సుమారు రూ.59.12 కోట్లు విడుదల చేస్తుంది. వారందరూ వచ్చేనెల నుంచి ఎల్1 ఆర్‌డీ స్కానర్ల ద్వారా పింఛన్లను నుంచి అందుకోనున్నారు.



ఏర్పాట్లు పూర్తి

కొత్తగా వచ్చిన ఎల్1 ఆర్‌డీ స్కానర్లను ఉపయోగించి పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపడతాం. ఇప్పటికే సచివాలయ సిబ్బందికి స్కానర్లను అందజేశాం. సాంకేతిక ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షిస్తాం.

- మల్లికార్జునరావు, ఎంపీడీవో, కొమరాడ

అటవీ ఉత్పత్తుల కొనుగోలు వేగవంతం

- పార్వతీపురం ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో శ్రీవాత్సవ

పార్వతీపురం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని జీసీసీ కేంద్రాల ద్వారా అటవీ ఉత్పత్తుల కొనుగోలు వేగవంతం చేశామని ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాత్సవ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చింతపండు, కొండచీపుర్లు, ముసిడిక పిక్కలు, అడవి తేనె , విప్ప పప్పు, మారేడు గడ్డలు, కరక్కాయలు, కుంకుడు కాయలు, ఎండు ఉసిరి తదితర వాటికి గతేడాది కంటే మద్దతు ధర పెంచినట్లు పేర్కొన్నారు. జీసీసీ ధరలపై గిరిజన రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఇంతవరకు పార్వతీపురం డివిజన్‌లో రూ.1.75 కోట్ల మేర అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేశామని తెలిపారు. రానున్న రోజుల్లో ఇంకా కొనుగోలు చేస్తామని పీవో తెలిపారు. ఆయన వెంట పార్వతీపురం జీసీసీ డీఎం మహేంద్రకుమార్ ఉన్నారు.

కదంతొక్కిన గిరిజనులు

- మద్దతు ధర కోసం సీతంపేట ఐటీడీఏ ఎదుట ధర్నా

సీతంపేట రూరల్,మార్చి 29(ఆంధ్రజ్యోతి): అటవీ ఉత్పత్తులకు మద్దతు ధర ప్రకటించి.. నేరుగా జీసీసీ కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని గిరిజనులు డిమాండ్ చేశారు. శనివారం సీతంపేట ప్రధాన రహదారిలో ర్యాలీ చేపట్టారు. ఆదివాసీ గిరిజనుల వేషధారణలతో నిరసన తెలిపారు. అనంతరం ఐటీడీఏ కార్యాలయం ప్రధాన గేటు ఎదురుగా బైఠాయించి మహా ధర్నా చేశారు. 80 కేజీల జీడిపిక్కల బస్తాను రూ.16వేలకు కొనుగోలు చేయాలని , సీతంపేట కేంద్రంగా జీడిపిక్కల పరిశ్రమ నెలకొల్పి గిరిజన యువతకు ఉపాధి కల్పించాలని నినాదాలు చేశారు. వంద పడకల ఏరియా ఆసుపత్రి అదనపు భవనం, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలని, చెరువులు, చెక్ డ్యాంలు నిర్మించి సాగునీరు అందించాలని కోరారు. తమ సమస్యలపై స్పందించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఐటీడీఏ ఏపీవో జి.చిన్నబాబుకు వినతిపత్రం అందజేశారు. గిరిజన సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న గిరిజనులు

ఇన్‌చార్జిలే దిక్కు

- పూర్తిస్థాయి కమిషనర్ల నియామకం ఎప్పుడో?
- మున్సిపాల్టీలు, నగర పంచాయతీలో గాడితప్పిన పాలన
- ప్రభుత్వం దృష్టి సారించాలని ప్రజల విన్నపం



పార్వతీపురం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పురపాలక సంఘాలు ఇన్‌చార్జిల పాలనలోనే కొనసాగుతున్నాయి. నగర పంచాయతీది కూడా అదే పరిస్థితి. దీంతో పాలనా వ్యవస్థ గాడి తప్పుతోంది. ప్రజలకు పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదు. వార్డుల్లో ప్రధాన సమస్యలు కూడా పరిష్కారానికి నోచుకోవడం లేదు. అభివృద్ధి పనులూ ముందుకు సాగడం లేదు. దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాలని జిల్లావాసులు కోరుతున్నారు. జిల్లాలో రెండు మున్సిపాల్టీలు, ఒక నగర పంచాయతీలో పరిస్థితిని పరిశీలిస్తే..

- సాలూరు కమిషనర్‌గా పనిచేసిన సీహెచ్ సత్యనారాయణను కొద్ది రోజుల కింద ప్రభుత్వానికి సరెండర్ చేశారు. విధుల్లో నిర్లక్ష్యం కారణంగా ఆయన్ని పక్కకు తప్పించారు. డీఈ ప్రసాద్‌కు పురపాలక సంఘం ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు అప్పగించారు. ఇన్‌చార్జి పాలన కారణంగా మున్సిపాలిటీలో పలు శాఖలపై పర్యవేక్షణ కొరవడింది. దీంతో పారిశుధ్యం, సామూహిక మరుగుదొడ్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందన్న విమర్శలు లేకపోలేదు. మున్సిపాలిటీలో అభివృద్ధి కార్యక్రమాలతో పలు ప్రజా ఉపయోగ పనులు నత్తనడకన సాగుతున్నాయి. పారిశుధ్య కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించడం లేదు. ఒకప్పుడు సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రోగాంలో సాలూరు పురపాలక సంఘం నేడు అధ్వాన స్థితికి చేరింది. సాలూరుకు పూర్వవైభవం తెచ్చే విధంగా పూర్తిస్థాయి కమిషనర్‌ను నియమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.
- పార్వతీపురం గ్రేడ్-1 పురపాలక సంఘానికి అదే స్థాయి కమిషనర్‌ను నియమించాల్సిన ఉంది. అయితే ఏడాదిగా ఎఫ్‌ఏసీ, వన్‌పే కమిషనర్లే తప్పా శాశ్వత ప్రాతిపదికన ఎవర్నీ నియమించడం లేదు. దీంతో మున్సిపాల్టీలో తాగునీటి సరఫరా మెరుగుపడడం లేదు. ప్రస్తుతం 30 వార్డులకు నాలుగు నుంచి ఐదు రోజులకొకసారి మాత్రమే తాగునీరు సరఫరా చేస్తున్నారు. పట్టణంలో పారిశుధ్యం కూడా లోపించింది. డంపింగ్ యార్డు తరలింపు సమస్య కూడా పరిష్కారానికి నోచుకోవడం లేదు. అభివృద్ధి పనులు మందకొడిగా సాగుతున్నాయి.

(మిగతా 10వ పేజీలో...)

మస్తర్లలో తప్పులు

- సామాజిక తనిఖీలో బట్టబయలు
- రికవరీకి ఆదేశించిన డ్వామా పీడీ రామచంద్రరావు

10లో

శాశ్వత లోక్ అదాలత్‌ను వినియోగించుకోండి

- పార్వతీపురం రెండో అదనపు జిల్లా న్యాయాధికారి దామోదరరావు

8లో

నేటి నుంచి నూకాలమ్మ జాతర

- పాచిపెంటలో ఏర్పాట్లు పూర్తి

10లో



ఉగాది వేడుకలకు సర్వం సిద్ధం

- మార్కెట్లు కళకళ
- ఏరువాకకు రైతుల సన్నాహాలు
- పంచాంగ శ్రవణానికి ఏర్పాట్లు



పాలకొండ: రద్దీగా ఉన్న పాలకొండ మార్కెట్

విజయనగరం/పాలకొండ/పార్వతీపురం/పార్వతీపురం టౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఉగాది.. తెలుగు నాట ఈ పండుగకు విశేష ప్రాశస్త్యం ఉంది. చైత్ర శుద్ధ పాడ్యమి నాడు తెలుగు రాష్ట్రాల్లో ఈ పండుగను ఘనంగా నిర్వహిస్తారు. ఆకురాలే శిశిర రుతువు నుంచి వసంతంలోకి అడుగుపెట్టే రోజున మనం ఉగాదిని జరుపుకుంటాం. అప్పటి వరకూ ఎండిన మోడుల్లా కనిపించిన మొక్కలు, చెట్లు చిగురు తొడగడం ప్రారంభిస్తాయి. పచ్చదనమనే చీర కట్టుకునేలా కనిపిస్తాయి. రుతువులు మారడం వల్ల వ్యాధులు సైతం విజృంభిస్తాయి. కాబట్టి వాటిని తట్టుకొని అధిగమించేందుకు షడ్రుచులతో కూడిన పచ్చడిని తింటారు. ఈ క్రమంలో ఆదివారం ఉగాది పండుగను ఘనంగా నిర్వహించేందుకు ఉమ్మడి జిల్లా ప్రజలు సిద్ధవుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని విజయనగరం, బొబ్బిలి, ఎస్.కోట, నెల్లిమర్ల, చీపురుపల్లి, పార్వతీపురం, సాలూరు, పాలకొండ, కురుపాం తదితర ప్రాంతాల్లోని మార్కెట్లు కొనుగోలుదారులతో శనివారం కిటకిటలాడాయి.

● రోజంతా శుభ ఘడియలు..

ఉగాది నాడు రోజంతా శుభ ఘడియలు ఉంటాయని పండితులు చెబుతారు. ఆ రోజున రైతులు ఏరువాకతో ఖరీఫ్ పనులకు శ్రీకారం చుడతారు. ఏరువాక ప్రారంభం తదితర వ్యవసాయ పనులు ఉగాది రోజున రైతులు చేపట్టనున్నారు. తమ పంటలు బాగుండాలని.. ఆర్థిక ఇబ్బందులు లేకుండా ప్రకృతి కన్నెర్ర చేయకుండా పంటలు పండాలని తదితర కోరికలతో రైతులు ఏరువాకకు శ్రీకారం చుడతారు. ఈమేరకు రైతులు మార్కెట్లలో ఏరువాకకు అవసరమైన వస్తువులను శనివారం కొనుగోలు చేశారు. గ్రామాల్లో పంచాంగ శ్రవణానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

● కొత్త వస్తువులకు ప్రాధాన్యం

ఉగాది నాడు చింతపండు, బెల్లం, పంచదార, ఖర్జూరం, బంగారం కొనడం ఆనవాయితీగా వస్తోంది. అధిక శాతం కొత్త దుస్తులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఉగాది రోజున పూజలకు అవసరమైన సామగ్రితో పాటు మామిడి కొమ్మలు, వేపపువ్వు, ఇతర సామగ్రిని కొనేవారితో మార్కెట్లు సందడిగా కనిపించాయి. పూజా సామగ్రి, పండ్లు, కొబ్బరికాయలు, పువ్వుల ధరలు అమాంతం పెరిగాయి. కొబ్బరికాయ ధర రూ.40 వరకూ పలికింది. మూర పువ్వుల ధర రూ.80 వరకూ ఎగబాకింది. చిన్నపాటి మామిడి కాయను సైతం రూ.20 వరకూ విక్రయించారు. ధరలు పెరిగినా ప్రజలు తప్పనిసరిగా వాటిని కొనుగోలు చేశారు.





పార్వతీపురం టౌన్: కిటకిటలాడుతున్న పార్వతీపురం ప్రధాన రహదారి


పాలకొండ: అరటి, మామిడికాయలు కొనుగోలు చేస్తున్న దృశ్యం



విక్రంపురంలో నాగలిని సిద్ధం చేస్తున్న రైతు

పూజ కోసం నాగళ్లు..

వీరఘట్టం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విక్రంపురం, నడుకూరు, చలివేంద్రి, చిదిమి తదితర గ్రామాల్లో శనివారం రైతులు నాగళ్లను సిద్ధం చేశారు. ఉగాది ముందు రోజు నాగళ్లకు ప్రత్యేక పూజలు చేసి... ఇళ్ల ముందు ఉంచుతారు. ఈ క్రమంలో ఏరువాక కోసం నాగళ్లను సిద్ధం చేశారు. ఆలయాల వద్ద పురోహితులు శ్రీవిశ్వావసు నామ సంవత్సర పంచాంగ శ్రవణం నిర్వహించారు.



ప్రథమ బహుమతి పొందిన చిత్రం

వేణుగోపాల్ చిత్రానికి బహుమతి

రాజాం రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కంచరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు పండూరు వేణుగోపాల్ తీసిన సైన్స్ చిత్రానికి అంతర్జాతీయ గుర్తింపు దక్కింది. ఫౌండేషన్ ఫర్ అడ్వాన్సింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఫాస్ట్) ఆధ్వర్యంలో ఈ ఏడాది జనవరి 11, 12 తేదీలలో పుణేలోని ఫెర్గుసన్ కాలేజీలో నిర్వహించిన నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌లో సైన్స్ ఇన్ ఫోకస్ చిత్ర ప్రదర్శనలో వేణుగోపాల్ చిత్రం మేటిగా నిలిచింది. ఈ చిత్ర ప్రదర్శనకు దేశంలోని గుర్తింపు పొందిన యూనివర్సిటీలతో పాటు ఇతర దేశాల నుంచి 30 చిత్రాలు వచ్చాయి. వీటిలో వేణుగోపాల్ తీసిన చిత్రం ప్రథమ స్థానాన్ని కైవశం చేసుకుంది. బహుళ కాంతి ధర్మాలను ఒకే ఫ్రేం (ఫోటో)లో పొందుపరిచే ఈ చిత్రం అందరి మన్ననలు పొంది అవార్డుకు ఎంపికైంది. ఒకే చిత్రంలో కాంతి క్రమ పరావర్తనం, కుంభాకార దర్పణం, పుటాకార దర్పణంలో కాంతి అక్రమ పరావర్తనం, కటకాలలో కాంతి వక్రీభవనం, కాంతి సంపూర్ణాంతర పరావర్తనం, కాంతి విక్షేపణం, కాంతి వివర్తనం వంటి పది ధర్మాలను చూపించడం ఈ చిత్రం ప్రత్యేకత. ఈ సందర్భంగా నిర్వాహకులు రూ.30 వేల నగదు, ప్రశంసాపత్రాన్ని వేణుగోపాల్‌కు అందించారు. ఆయనను పాఠశాల ప్రధానోపాధ్యాయులు వసంత కుమార్, సిబ్బంది అభినందించారు.

నూకాలమ్మకు అరటి పండ్లతో అలంకరణ



వేపాడ: ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు

కొత్తవలస, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కొత్త అమావాస్య సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లో గ్రామ దేవతలకు శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మంగళపాలెంలో నూకాలమ్మను భక్తులు అరటి పండ్లతో అలంకరించారు. దేవాడ-ముసిరాం మధ్య ఉన్న తోటలో దుర్గమ్మను గాజులతో అలంకరించి పూజలు చేశారు. ముసిరాం, వియ్యంపేట, వీరభద్రపురం, నరపాం, గొల్లలపాలెం, ములగపాకవానిపాలెం, కర్రి చిన్నయ్యపాలెంలో వెదుళ్ల పైడితల్లమ్మ వారికి పూజలు చేశారు. రామలింగపురం, దేశపాత్రునిపాలెం గ్రామాలలో బంగారమ్మకు పూజలు నిర్వహించారు.

వేపాడలో...

వేపాడ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): వావిలపాడు, బొద్దాం, వేపాడ, సోంపురం తదితర గ్రామాల్లో ఉగాదిని పురస్కరించుకుని నూకాలమ్మతల్లి పండగను వైభవంగా నిర్వహించారు. వావిలపాడులో శుక్రవారం తొలేళ్ల పండగ, శనివారం అమ్మవారి పండగను నిర్వహించారు. ఆదివారం అనుపోత్సవం జరుగుతుంది. ఈ సందర్భంగా ఎడ్ల పరుగు పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. సోంపురం, వేపాడ, వావిలపాడు తదితర గ్రామాల్లో అమ్మవారి ఆలయాల వద్ద అన్న సంతర్పణ చేశారు.



మంగళపాలెంలో నూకాలమ్మను అరటి పండ్లతో అలంకరించిన దృశ్యం

శాశ్వత లోక్ అదాలత్‌ను వినియోగించుకోండి



సమావేశంలో పాల్గొన్న రెండో అదనపు జిల్లా న్యాయాధికారి దామోదరరావు

బెలగాం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): శాశ్వత లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని పార్వతీపురం రెండో అదనపు జిల్లా న్యాయాధికారి ఎస్.దామోదర రావు అన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం ఏర్పాటు చేసిన పారా లీగల్ వలంటీర్ల శిక్షణ సమావేశంలో ఆయన మాట్లాడారు. నీరు, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు, పోస్టల్, టెలిఫోన్ సేవల్లోని వివాదాలు, పారిశుధ్యం, ప్రజా సంరక్షణ సేవల్లో సమస్యలు, బ్యాంకులు, ఇతర ఆర్థిక లావాదేవీలు జరిపే సంస్థల్లోని వివాదాలను పరిష్కరించే అధికారం శాశ్వత లోక్ అదాలత్‌కు ఉందని వివరించారు. ఆసుపత్రులు, డిస్పెన్సరీల సేవల వల్ల వచ్చే వివాదాలు, బీమా సంస్థల్లో వివిధ కారణాలతో ఏర్పడే సమస్యలను శాశ్వత లోక్ అదాలత్‌తో పరిష్కరించుకోవచ్చునని సూచించారు. శాశ్వత లోక్ అదాలత్ ఇచ్చే తీర్పు అంతిమమని, దీనిపై అపీల్ చేసుకునే అవకాశం ఉండదన్నారు. ఈ సందర్భంగా పారా లీగల్ వలంటీర్లకు విధివిధానాలను వివరించారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు టి.జోగారావు, ప్రభుత్వ సహాయ అడ్వకేట్ బి.సత్యనారాయణ, అడ్వకేట్లు ఎంవీ రమణ, ఎ.లక్ష్మీపతిరాజు, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

ఊరూరా ఎగిరిన పసుపు జెండా

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఎక్కడికక్కడ ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి... నివాళులర్పించారు. పార్టీ జెండాలను ఆవిష్కరించారు. కొన్నిచోట్ల నాయకులు, కార్యకర్తలు సైకిల్ ర్యాలీలు నిర్వహించారు. కేకులు కట్ చేశారు. సీనియర్ నాయకులు, కార్యకర్తలను సత్కరించారు.



బొబ్బిలి: ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన, పార్టీ శ్రేణులు



గంట్యాడ: ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన మంత్రి శ్రీనివాస్



ఎస్.కోట: సీనియర్ కార్యకర్తను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి

సంక్షేమ పథకాల రూపకర్త ఎన్టీఆర్

పార్వతీపురం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, దివంగత నందమూరి తారక రామారావుతోనే సంక్షేమ పథకాలకు బీజం పడిందని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. జిల్లా కేంద్రం పార్వతీపురంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్థానిక పాత బస్టాండ్‌లో ఎన్‌టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం 13వ వార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్‌టీఆర్ విగ్రహాన్ని ఆయన ప్రారంభించారు. ఆ తరవాత నర్సిపురం పంచాయతీ పరిధిలో ఉన్న ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం ప్రాణాలైనా అర్పిస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, పార్వతీపురం, సీతానగరం, బలిజిపేట, పార్వతీపురం టౌన్ పార్టీ అధ్యక్షులు బోను దేవి చంద్రమౌళి, పెంకి వేణుగోపాలనాయుడు, రౌతు వేణు, జి.రవికుమార్, ఐటీడీపీ కన్వీనర్ బార్నాల సీతారామారావు, డాక్టర్ భాను ప్రసాద్, పెదబోగిలి సర్పంచ్ తేరేజమ్మ తదితరులు పాల్గొన్నారు. కౌన్సిలర్ నారాయణరావు, బుడితి శ్రీరాములు, నీలావు చంటి తదితరులకు ప్రశంసాపత్రాలు అందించారు.

ఎన్టీఆర్ స్ఫూర్తి ప్రదాత..

బొబ్బిలి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలంటే అన్ని వర్గాల ప్రజలకు సమున్నతమైన సేవలందించడమని ఎన్టీఆర్ ఆచరించి చూపించారని బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన)అన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం బొబ్బిలి కోటలో పతాకాన్ని ఆవిష్కరించారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. బేబీనాయన మాట్లాడుతూ పేదల గుండెల్లో ఎన్టీఆర్ చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో జీవితాంతం ప్రజలకు సేవలందిస్తామని అన్నారు. అనంతరం ఎన్టీఆర్ కూడలిలో గల ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పార్టీ సీనియర్ నాయకుడైన రౌతు రామ్మూర్తి నుంచి పార్టీ సభ్యత్వ కార్డును స్వీకరించి ఆయనకు పాదాభివందనం చేశారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు రాంబార్కి శరత్‌బాబు, నేతలు రౌతు రామ్మూర్తి, గెంబలి శ్రీనివాసరావు, పువ్వల శ్రీనివాస రావు, కాకల వెంకటరావు, కంచి వెంకటరావు, మహిళా కౌన్సిలర్లు వెలగాడ హైమావతి, కింతలి శ్రీదేవి, బంగారురాజు, నంది హరి, బొద్దాన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తగా పని చేయడం అదృష్టం

శృంగవరపుకోట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ నాయకులుగా, కార్యకర్తలుగా పని చేయడం అదృష్టమని శాసన సభ్యురాలు కోళ్ల లలిత కుమారి అన్నారు. శనివారం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాల వేసి... నివాళులు అర్పించారు. అనంతరం సీనియర్ కార్యకర్తలకు సన్మానం చేశారు. పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందించారు. ఎంపీపీ సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఇందుకూరి సుధారాణి, మండల పార్టీ అధ్యక్షుడు జీఎస్‌నాయుడు, మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న, నాయకులు కొణదం మల్లేశ్వరరావు, కాపుగంటి వాసు, కిరణ్, పెదగాడి రాజు, రాయవరపు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీకి కార్యకర్తలే బలం..

గంట్యాడ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే పెద్ద బలమని ... వారే ముందుకు నడిపిస్తున్నారని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. తెలుగు దేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం నరవ కూడలిలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం పని చేసిన ప్రతి కార్యకర్తను గుర్తిస్తామని తెలిపారు. యువతకు పార్టీలో పెద్ద పీట వేస్తామని తెలిపారు. వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఎన్‌టీఆర్ ఆశయ సాధన దిశగా సీఎం చంద్రబాబునాయుడు పని చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావు, మండల టీడీపీ అధ్యక్షులు కొండపల్లి భాస్కర్ నాయుడు, టీడీపీ నాయకులు విజయ కుమార్, సుంకరి రామునాయుడు, జి.శ్రీనివాసరావు, రంధి అర్జున మహేశ్వరరావు, బూడి అప్పలనాయుడు, సుంకరి సాయికృష్ణ , రొంగళి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమం కోసం పుట్టినదే టీడీపీ

నెల్లిమర్ల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల సంక్షేమం కోసం ఏర్పాటైన పార్టీ తెలుగుదేశం అని ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్, టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. నెల్లిమర్లలో శనివారం సీనియర్ నాయకుడు, విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన పార్టీ ఆవిర్భావ వేడుకలకు బంగార్రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత దివంగత ఎన్టీ రామారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు కడగల ఆనంద్ కుమార్, గేదెల రాజారావు, జిల్లా కార్యదర్శి లెంక అప్పలనాయుడు పాల్గొన్నారు.

టీడీపీ ఆవిర్భావమే ఓ చరిత్ర..

రాజాం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఆవిర్భావమే ఓ చరిత్ర అని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత పార్టీ జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్యే... అనంతరం దివంగత ఎన్టీఆర్‌కు ఘన నివాళులు అర్పించి.. కేక్‌ను కట్ చేశారు. సీనియర్ నాయకులు, కార్యకర్తలు నంది సూర్యప్రకాష్‌రావు, సమల మన్మథరావు, పిన్నింటి మోహన్ రావు, కిమిడి అశోక్‌కుమార్, వంగా వెంకటరావు, లచ్చుభుక్త కృష్ణమూర్తి, టంకాల కన్నంనాయుడు, ఉరిటి సురేంద్ర, బాణాన విష్ణులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో గురవాన నారాయణరావు పాల్గొన్నారు.



పార్వతీపురం: ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర



నెల్లిమర్ల: ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న బంగార్రాజు తదితరులు



రాజాం: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్



ఎంపీ కలిశెట్టికి సైకిల్‌ను అందజేస్తున్న అశోక్‌గజపతిరాజు

రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

● మంత్రి కొండపల్లి శ్రీనివాస్



మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

బొండపల్లి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): రైతు సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. శనివారం బొండపల్లిలో బీవీ చానల్ పరిధిలో గల 13 వంతుల కాలువకు సంబంధించిన రైతుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ గజపతినగరం, బొండపల్లి మండలాలకు సంబంధించి గ్రామాల రైతులు ఆంధ్ర జలాశయం నీటి ద్వారా పంటలు పండిస్తున్నారని గుర్తుచేశారు. పట్టువాడ వద్ద చంపావతి నదిలో కాలువ నిర్మించి సుమారు 2,700 ఎకరాలకు నీరు అందించేందుకు కృషి చేస్తామన్నారు. వ్యవసాయాధిరిత పరిశ్రమలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. అనంతరం చందకపేట గ్రామానికి చెందిన వెలుగుల లవ్‌కుమార్ ఇటీవల మృతిచెందడంతో టీడీపీ సభ్యత్వ నమోదు చేసుకోవడంతో భార్యకు రూ. ఐదు లక్షలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్వరరావు, ఎంపీడీవో జి.గిరిబాల, వ్యవసాయాధికారి మల్లిఖార్జునరావు, టీడీపీమండలాధ్యక్షుడు కోరాడ కృష్ణ, బీవీ చానల్ అధ్యక్షుడు రమేష్‌రాజు, 13వ వంతుల కాలువఅధ్యక్షుడు బి.మురళీరాజు మక్కువ శ్రీధర్, రాజేష్ సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్



గోదాములో ఈవీఎంలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ బీఆర్ అంబేద్కర్

నెల్లిమర్ల, మార్చి 29(ఆంధ్రజ్యోతి):ఈవీఎం గోదాముల వద్ద పోలీసు సిబ్బందిని అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆదేశించారు. శనివారం నెల్లి మర్లలోని ఈవీఎం గోదాములను అంబేద్కర్ తనిఖీచేశారు. షట్టర్లకు వేసిన సీళ్లను తెరిపించి లోపల గదుల్లో ఉంచిన ఈవీఎంలను పరిశీలించారు. ఏడు నియోజకవర్గాల గదులను తెరిపించడంతోపాటు అనంతరం దగ్గరుండి సీళ్లను వేయించారు. గోదాముల వద్ద భద్రతను సమీక్షించారు. ఆయన వెంట డీఆర్వో ఎస్. శ్రీనివాస మూర్తి, ఆర్డీవో డి.కీర్తి, తహసీల్దార్ సుదర్శన్, ఎన్నికల సూపరింటెండెంట్ భాస్కరరావు, రెవెన్యూ సిబ్బంది, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ట్రైనీ పీడీలు

విజయనగరం కలెక్టరేట్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి):జిల్లాలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శిక్షణ నిమిత్తం వచ్చిన పల్నాడు, కాకినాడ జిల్లాలకు చెందిన ట్రైనీ పీడీలు పి.ఝాన్సీ రాణి, జి.శ్రీనివాసరావు శనివారం కలెక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను కలెక్టరేట్‌లో కలిశారు.వారి వెంట డీఆర్‌డీఏ పీడీ కళ్యాణ్ చక్రవర్తి కూడా ఉన్నారు. జిల్లాలో మొత్తం నలుగురు పీడీలు శిక్షణ పొందగా ఇద్దరు ఇప్పటికే శిక్షణ పూర్తి చేసుకున్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దు: ఎస్పీ

విజయనగరం క్రైం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వవద్దని ఎస్పీ వకుల్ జిందాల్ ఒక ప్రకటనలో కోరారు. మైనర్ల డ్రైవింగ్‌తో చట్టపరమైన చిక్కులు తప్పవని, 18 ఏళ్ల లోపు వయస్సు గల వ్యక్తులు వాహనంనడపడం చట్టరీత్యానేరమని పేర్కొన్నారు.మైనర్లు వాహనాలు నడపడంవల్ల నిబంధనలు ఉల్లంఘించడంతో రహదారి ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. మైనర్లు వాహనాలు నడిపి ప్రమాదాలకు కారకులైతే, ప్రమాద బీమా చెల్లించేందుకు కంపెనీలు నిరాకరిస్తాయని పేర్కొన్నారు. మైనర్ల డ్రైవింగ్‌కు సంబంధించి 2024లో 2,747, 2025 మార్చి వరకూ 967 కేసులు నమోదు చేశామని తెలిపారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

● అదనపు జిల్లా న్యాయాధికారి పద్మావతి



నెల్లిమర్ల: మాట్లాడుతున్న పద్మావతి

నెల్లిమర్ల, మార్చి 29(ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని అదనపు జిల్లా న్యాయాధికారి ఎం.పద్మావతి తెలిపారు. శనివారం నెల్లిమర్లలోని కస్తూరిబా గాంధీ విద్యాలయంలో చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో బాలల హక్కుల పరిరక్షణ సమితి ప్రతినిదులు పి.చిట్టయ్య, చిట్టిబాబు, నెల్లిమర్ల ఎస్ఐ బి.గణేష్, కస్తూరిబా పాఠశాల ప్రిన్సిపాల్ ఉమా పాల్గొన్నారు.

మహిళలతో స్నేహపూర్వకంగా మెలగాలి

రాజాం రూరల్, మార్చి 29(ఆంధ్రజ్యోతి):మహిళలను గౌరవిస్తూ వారితో స్నేహపూర్వక వాతావరణంలో మెలగాలని మండలన్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు, సీనియర్ న్యాయాధికారి కె.శారదాంబ కోరారు. శనివారం రాజాంలోని కోర్టు ప్రాంగణ సముదాయంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు.మహిళలకు రక్షణకల్పించేందుకు 2013 లో రూపొందించిన పని ప్రదేశంలో మహిళలకు రక్షణ చట్టంపై అవగాహన కల్పించారు.

●సంతకవిటి,మార్చి 29(ఆంధ్రజ్యోతి):మండలంలోని గుళ్ళసీతారాంపురంలో సీతారాముల ఆలయం ఆవరణలో న్యాయ విజ్ఞాన సదస్సును రాజాం మండల న్యాయ సేవా సంస్థ అధ్యక్షులు, సీనియర్ సివిల్ జడ్జి కె.శారదాంబ ఆధ్వర్యంలో నిర్వహించారు.కార్యక్రమంలో జూనియర్ సివిల్ న్యాయాధికారి కె.నైమిష, ఎస్ఐ ఆర్.గోపాలరావు, ఎంపీడీవో కె.సురేష్‌కుమార్, బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ ఎం.శ్రీనివాసరావు,ఆర్.విజయ్‌కుమార్, ఎ.సత్యనారాయణ, సర్పంచ్ రావు రవీంద్ర పాల్గొన్నారు.

● శృంగవరపుకోట మార్చి 29 (ఆంధ్రజ్యోతి): బాలలపై జరిగే నేరాలకు కఠిన శిక్షలు ఉన్నాయని శృంగవరపుకోట మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి సబ్బవరపు వాణి తెలిపారు.స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో న్యాయ అవగాహన సదస్సులో పోక్సో చట్టం గురించి వివరించారు. కార్యక్రమంలో న్యాయ వాదుల సంఘ ఉపాధ్యక్షుడు బి.వెంకటరావు, న్యాయవాదులు ప్రకాశరావు, సత్యనారాయణ, సీఐ నారాయణమూర్తి పాల్గొన్నారు.

సర్పంచ్, ఎంపీటీసీలకు గౌరవం ఇవ్వాలి

● శాసనమండలి సభ్యుడు ఇందుకూరి రఘురాజు

శృంగవరపుకోట మార్చి 29 (ఆంధ్రజ్యోతి) సర్పంచ్, ఎంపీటీసీలకు గౌరవం ఇవ్వాలని శాసనమండలి సభ్యుడు ఇందుకూరి రఘురాజు కోరారు. శనివారం శృంగవరపుకోటలో జరిగిన మండల పరిషత్ సమావేశంలో ప్రజాప్రతినిధులకు అధికారులు గౌరవం ఇవ్వడం లేదని సభ దృష్టికి రావడంతో ఆయన మాట్లాడుతూ గౌరవం ఇవ్వాలని సూచించారు. అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు ఇందుకూరి సుధారాణి, పినిశెట్టి వెంకట రమణ, తహసీల్దార్ ఎం.అరుణ కుమారి, ఈవోపీఆర్డీ వీవీ లక్ష్మి పాల్గొన్నారు.

ప్రతి కేసూ రిఫర్‌చేయడం సరికాదు

మెంటాడ, మార్చి 29(ఆంధ్రజ్యోతి):మెంటాడ,చల్లపేట పీహెచ్‌సీకి వచ్చే ప్రతి కేసు వైద్య సిబ్బంది రిఫర్‌చేయడం సరికాదని ఎంపీపీ సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీ ఈశ్వరరావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు వైద్యులను నిలదీశారు. శనివారం మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సన్యాసినాయుడు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓ వ్యక్తి బీపీ సమస్యపై పీహెచ్‌సీకి వెళ్తే గజపతినగరం ఏరియా ఆసుపత్రికి, అక్కడ సిబ్బంది ఘోష ఆసుపత్రికి రిఫర్‌చేశారని ఆరోపించారు. పీహెచ్‌సీల్లో ప్రజాప్రతినిధుల సెల్‌ఫోన్ నెంబర్లను అందుబాటులో ఉంచాలని కోరారు.ముఖ్య కూడళ్లు, బస్టాండ్లు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని తహసీల్దార్ శ్రీనివాసరావు కోరారు.కార్యక్రమంలో ఎంపీడీవో భానుమూర్తి, వైస్‌ఎంపీపీ దుర్గ పాల్గొన్నారు.

ఎస్.కోట పంచాయతీ సమావేశంలో వాగ్వాదం

శృంగవరపుకోట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోటలో శనివారం జరిగిన పంచాయతీ సాధారణ సమావేశంలో సర్పంచ్ గనివాడ సంతోషి కుమారి, సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. తొలుత తమ వార్డుల్లో అభివృద్ధి పనులకు సర్పంచ్ సహకరించలేదని సభ్యుడు గనివాడ శ్రీనివాసరావు ప్రశ్నించారు. పంచాయతీలో నిధులు లేకుండ దాదాపు రూ. ఐదు కోట్లు విలువ గల అభివృద్ధి పనులకు తీర్మానాలు ఎందుకు పెట్టారని సభ్యుడు కాపుగంటి శ్రీనివాసరావు అభ్యంతరం తెలిపారు. ఎజెండాలో పొందుపరిచిన అభివృద్ధి పను లకు సంబంధించిన తీర్మానాలను వ్యతిరేకించారు.నాలుగేళ్లగా తీర్మానాలు జరుగుతున్న ఒక్క అభివృద్ధి పని కనిపించడం లేదని ఉప సర్పంచ్ మోపాడ కుమార్ ఆరోపించారు. దీంతో సర్పంచ్ మాట్లాడుతూ అభివృద్ధి పనుల నిర్వహణకు సభ్యులు ఎప్పుడైనా సహకరించారా అని సర్పంచ్ ప్రశ్నించారు.

స్కేటింగ్‌లో సత్తాచాటిన బాలిక

భోగాపురం,మార్చి29(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొల్లింకలపాలెంకు చెందిన బాలిక బొల్లింకల కార్తికశరణ్య అంతర్జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో సత్తా చాటింది.ఈ మేరకు సిల్వర్‌మెడల్ సాధించినట్లు బాలిక తండ్రి బి.అప్పన్న తెలిపారు. వారు విశాఖలో స్థిరపడ్డారు. తైవాన్ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ 2025ట్రోఫీలో దేశం తరుపున పాల్గొని సిల్వర్ మెడల్ సాధించినట్లు తెలిపారు.

రేపు పీజీఆర్ఎఫ్ రద్దు

విజయనగరం క్రైం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రంజాన్ పురస్కరించుకుని సెలవు ప్రకటించడంతో సోమవారం జిల్లా పోలీసు శాఖ కార్యాలయంలో నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎఫ్) రద్దు చేస్తున్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ శనివారం ఒకప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని, ఫిర్యాదులు చేసేందుకు జిల్లా పోలీసు కార్యాలయానికి రావద్దని కోరారు.

2న రుణాలకు ఇంటర్వ్యూలు

విజయనగరం రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి):బీసీ, ఈబీసీ, కాపు కార్పొరేషన్ ద్వారా రుణాలకు దరఖాస్తుచేసేవారికి వచ్చే నెల రెండో తేదీన మండలపరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గంటా వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం జరిగే ఇంటర్వ్యూలకు ఆయా గ్రామాల దరఖాస్తుదారులు హాజరుకావాలని కోరారు.

11న కలెక్టరేట్ వద్ద ధర్నా

విజయనగరం దాసన్నపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఏప్రిల్11న కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా నిర్వహిస్తున్నామని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి సోము రాంబాబుతెలిపారు. శనివారం విజయనగరంలోని కంటోన్మెంట్‌లోగల పార్టీ జిల్లా కార్యాలయంలో ధర్నాకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు కొమ్ముసోములు, శివప్రసాద్, గౌరీ, ప్రకాష్‌రావు, రాము,వెంకటరావు పాల్గొన్నారు.

విపత్తుల్లో అండగా ఉండాలి

లక్కవరపుకోట, మార్చి 29(ఆంధ్రజ్యోతి): విపత్తుల సమయంలో కంపెనీలు బాధితులకు అండగా నిలబడి వారిని మానవత్వంతో ఆదుకోవాలని ఎమ్మెల్యే లలితకుమారి కోరారు. శనివారం ఎల్.కోటలో శారదా కంపెనీ యాజమాన్యం ఎండీ నీరజ్ సహకారంతో రాయుడుపేటలో మూడుఅగ్నిప్రమాద బాధిత కుటుంబాలకు గాను ఒక్కో కుటుంబానికి రూ.ఐదు వేల నగదు, నిత్యవసర సరుకులు, వంట సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో శంకర్, కొట్యాడ రమణమూర్తి, పోతల రమణ పాల్గొన్నారు.

ఏఎంసీ డైరెక్టర్‌గా నాయుడు

నెల్లిమర్ల, మార్చి 29(ఆంధ్రజ్యోతి): పూసపాటిరేగ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేటకు చెందిన జనసేన పార్టీ నాయకుడు ఎంఎం నాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు నాయుడును జనసేన నాయకులు చనమల్లు వెంకటరమణ శనివారం సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు కరుమజ్జి గోవిందరావు, నల్లి బంగారు చంద్రశేఖర్, తుమ్ము వెంకటరమణ, గదల అచ్చింనాయుడు, పతివాడ గోవిందరావు, చింతపల్లి అప్పలస్వామి పాల్గొన్నారు.

నమాజ్ పుస్తకాల పంపిణీ

విజయనగరం రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని దాసన్నపేట, కుమ్మరవీధి, గొడ్డుపాలెం, రాజుల తమ్మాపురం, పెదవేమలితోపాటు పలు ప్రాంతాల్లో రంజాన్ పురస్కరించుకుని నమాజ్ పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని పట్టణ శాఖ ముస్లింశాఖ ప్రతినిధి మహ్మద్ గౌస్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఖాదర్‌బీబీ, ఆమీరజానీ, దావుద్, షాజన్, మదీనా పాల్గొన్నారు.

శ్రీరామనవమి వరకూ పూజలు

విజయనగరంబాబామెట్ట, మార్చి29 (ఆంధ్రజ్యోతి): విజయనగరం శంకరమఠంలో ఉగాది నుంచి శ్రీరామనవమి వరకూ పూజలు నిర్వహించనున్నట్లు మఠం కమిటీ కార్యదర్శి పి.రాజేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈసందర్భంగా రోజూ ఉదయం ఆరునుంచి,సాయంత్రం ఐదు గంటల నుంచి పూజలు నిర్వహిస్తామని అర్చకులు సూర్యనారాయణ శాస్త్రి తెలిపారు.

బంగారయ్యకు పురస్కారం

నెల్లిమర్ల, మార్చి 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని తంగుడుబిల్లి ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు శివుకు బంగారయ్యకు గురుబ్రహ్మతోపాటు విద్యా రంగంలో ఆణిముత్యం పురస్కారం లభించింది. ఈ మేరకు విశాఖకు చెంది మదర్‌థెరీసా స్వచ్ఛంద సంస్థ ఉగాది పురస్కరించుకుని పురస్కారం అందజేసింది.

●విజయనగరం రింగురోడ్డు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుడు బొడ్డేపల్లి రామకృష్ణకు గురుబ్రహ్మ అవార్డు లభించింది. 189సార్లు రక్తదానం సామాజిక సేవలకు గాను విశాఖలో ఉగాదిని పురస్కరించుకుని మదర్‌థెరిస్సా సోషల్ వేల్పేర్ ఆర్గనైజేషన్ గురుబ్రహ్మ ఆణిముత్యం అవార్డుతో సత్కరించారు.

సీఎంఆర్ఎఫ్‌తో పేదల ఆరోగ్యానికి భరోసా

● తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శి రామ్‌మల్లిక్‌నాయుడు



సీఎంఆర్ఎఫ్ ప్రొసీడింగ్ ఆర్డర్‌ను అందజేస్తున్న రామ్‌మల్లిక్‌నాయుడు

చీపురుపల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలోని పేదల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి సహాయ నిధి పూర్తి భరోసా కల్పిస్తోందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు తెలిపారు. శనివారం చీపురుపల్లిలోని టీడీపీ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన 22.72 లక్షల విలువైన చెక్కులను నాలుగు మండలాలకు చెందిన 12 మంది బాధితులకుఅందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కుచ్చర్లపాటి త్రిమూర్తులరాజు, రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు, కిరణ్, కెంగువ ధనుంజయ్, వెంపడాపు లక్ష్మనాయుడు, అరతి సాహు పాల్గొన్నారు.

రాత్రి వరకు సోషల్ ఆడిట్



అధికారులతో వాదిస్తున్న స్థానికులు

గరివిడి, మార్చి 29(ఆంధ్రజ్యోతి):స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధిహామీ పథకంపై ఎంపీడీవో సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఎనిమిది గంటల వరకు సోషల్ ఆడిట్ జరిగింది. మండలంలో ఉపాధి పథకంలోభాగంగా 1,804 వివిధ రకాల పనులకు గానూ రూ. 30 కోట్ల 27లక్షలు నిధులు ఖర్చుచేశారు. కోనూరు, ఎం.దుగ్గివలస, అప్పన్నవలస, బీజేపాలెం తదితర గ్రామాల్లో సోషల్ ఆడిట్ జరుగుతున్న సమయంలో గందరగోళం నెలకొంది. ఆయా గ్రామాల్లో భారీగా అవినీతి జరిగిందని వాగ్వాదం చోటుచేసుకుంది. గరివిడి ఎస్ఐ లోకేశ్వరరావు సిబ్బందితో సోషల్ ఆడిట్ వద్ద పహారా కాసి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో తహసీల్దార్ బంగార్రాజు, ఎంపీపీ విజయలక్ష్మి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సంతకం లేకుండా పేమెంట్

సంతకవిటి,మార్చి29(ఆంధ్రజ్యోతి):సంతకవిటి ఎన్ఆర్‌జీఎస్ కార్యాలయం ఆవరణలో శనివారం సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. 34 పంచాయతీల పరిధిలో 2023-24లో ఉపాధిహామీ, పంచాయితీరాజ్, హౌసింగ్ కింద రూ. 21 కోట్లతో చేపట్టిన పనులపై విచారణ చేపట్టారు. విజయనగరం, రాజాం ఏపీడీలు వై.పద్మజ, ఎం.శ్రీనివాసరావు, ఎస్ఆర్‌పీ బి.మన్మథరావు ఆధ్వర్యంలో విచారణ చేసిన పలు విషయాలు వివరించారు. మండలంలోని పలు గ్రామాల్లో వేతనదారుని వేలిముద్ర, సంతకం లేకుండానే పేమెంట్ చేశారని తెలిపారు.రామాయిపురం, మంతిన ఫీల్డ్ అసిస్టెంట్లు గైర్హాజరుకావడంతో వారిపై చర్యలు తీసుకుంటున్నామని, తనిఖీల్లో రికవరీ ఎంత అన్నది ఇంకా గుర్తించాల్సి ఉందని ఏపీవో హరినాథరావు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీ వో కె.సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

విజయనగరం రింగురోడ్డు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఇస్కాన్ టెంపుల్ ప్రతినిధి కెనాడ దేశస్థుడు హెచ్‌జీ పంచరత్న ప్రభు తెలిపారు.శనివారం విజయనగరంలోని మహారాజా అటానమస్ కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ యూనిట్ల సంయుక్తంగా ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాలతో భవిష్యత్తును నాశనం చేసుకోవద్దనికోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సాంబశివరావు, కన్వీనరు సన్యాసిరావు, ఎన్‌సీసీ నోడల్ అధికారి సన్యాసిరావు, ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ కళ్యాణ అశోక్, చిన్నంనాయుడు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

దిగజారిపోయిన జీవన ప్రమాణాలు

● సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నేతలు

విజయనగరం దాసన్నపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ విధానాల వల్ల కార్పొరేట్లు, సంపన్నుల లాభాలు పెరుగుతున్నాయని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్ ఆరోపించారు. ద్రవ్యోల్బణం పెరిగి ఉద్యోగ అవకాశాలు పడిపోవడంతోపాటు జీవన ప్రమాణాలు దిగజారిపోతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. శనివారం విజయనగరంలోని కార్మికవాడల్లో నియోజకవర్గసమితి ఆధ్వర్యంలో రాజకీయ ప్రచారజాతా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భగత్‌సింగ్ పోరాటస్ఫూర్తితో కార్పొరేట్ సంస్థల నుంచి దేశాన్ని కాపాడుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ ప్రతినిధులు అప్పలరాజు, వాసు, సూర్యనారాయణ, పి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా నిర్వహించాలి

విజయనగరం దాసన్నపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాల లబ్ధిదారుల ఎంపిక రాజకీయాలకు ఆస్కారం లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని అంబేద్కర్ రైట్స్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు బొంగా భానుమూర్తి కోరారు. ఈమేరకు శనివారం విజయనగరం నగరపాలకసంస్థ కమిషనర్ నల్లనయ్యకు వినతి పత్రం అందజేశారు.కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు వంశీ పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించాలి

శృంగవరపుకోట రూరల్,మార్చి 29:మండలంలోని దారపర్తి పంచాయతీ పరిధిలోగల పల్లపుదుంగాడ గిరిశిఖర గ్రామంలో ఉపాధి పనులు కల్పించాలని సీపీఎం నాయకులు కోరారు. శనివారం పల్లపుదుంగాడలో సీపీఎం ఆధ్వర్యంలో గిరిజనులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనులకు ఏడాదిగా ఉపాధి పనులు కల్పించడంలేదని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు మద్దిల రమణ,గాడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అద్దె చెల్లించకపోవడంతో సచివాలయానికి తాళం

గరివిడి, మార్చి 29(ఆంధ్రజ్యోతి):మండలంలో కొండపాలెం గ్రామ సచివాలయం-3 భవనానికి యజమాని ముల్లు రాంబాబు శనివారం తాళం వేశారు. సచివాలయ భవనానికి మూడేళ్ల కిందట నెలకు రూ.ఎనిమిది వేల చొప్పున అద్దెకు ఇచ్చారు. ఇంతవరకు సచివాలయం అధికారులు రూ.80వేలు మాత్రమే అద్దె చెల్లించారని, ఇంకా రూ.2లక్షల 64వేల అద్దె చెల్లించాల్సిఉందని, దీంతో తాళం వేసినట్టు ముల్లు రాంబాబు తెలిపారు.కాగా గతం తాము ఎనిమిది నెలకు చెల్లించామని ఇంటి యజమాని చెబుతున్నారని, అయితే నిబంధనల మేరకు తమకు అంతమేరకు అద్దె చెల్లింపునకు అవకాశంలేదని పంచాయతీ ఈవో నాగమణి తెలిపారు. పంచాయతీ పెద్దల దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు: డీపీవో



మెరకముడిదాం: మాట్లాడుతున్న డీపీవో వెంకటేశ్వరరావు

మెరకముడిదాం, మార్చి 29(ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని డీపీవో వెంకటేశ్వరరావు కోరారు.శనివారం మెరకముడిదాంలో పంచాయతీ కార్యదర్శుల తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పధానరహదారులు, బస్‌షెడ్లు, రద్దీగాఉన్న ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటుచేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కరరావు, ఏఈ శివబాబు పాల్గొన్నారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలి

వేపాడ మార్చి 29 (ఆంధ్రజ్యోతి)నీటిఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ తాగునీటి ఎద్దడి నివారణపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించారని,దీనిపై మండలంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మండల స్థాయిలోకంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని, మండలస్థాయి అధికారులంతా సమన్వయంతో పనిచేసి నీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. మండలంలోని 16 పశువుల తొట్టెలు ఏర్పాటుకు పశువైద్యాధిరులు,ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సంయుక్తంగా స్థల పరిశీలనను చేపట్టి ప్రతిపాదనలు పంపించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

చలివేంద్రాలు ఏర్పాటుచేయండి

పూసపాటిరేగ, మార్చి29(ఆంధ్రజ్యోతి): వడదెబ్బ తగలకుండా ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని డిప్యూటీ సీఈవో వెంటరమణ కోరారు.పూసపాటిరేగలో మండలస్థాయి అధికారులకు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నీటి ఎద్దడి ఎక్కడా తలెత్తకుండా చూడాలని కోరారు. ప్రధాన కూడళ్లు, ప్రభుత్వ కార్యాలయాలవద్ద చలివేంద్రాలు ఏర్పాటుచేయాలని సూచించారు.సమావేశంలో ఎంపీడీవో రాధిక పాల్గొన్నారు.

నీటిఎద్దడి ఉన్నగ్రామాలను గుర్తించండి

చీపురుపల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఎక్కడా తాగు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి, డీఎల్‌డీఓ హేమసుందర్ ఆదేశించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమవేశం నిర్వహించారు. ఈ సందరర్భంగా మాట్లాడుతూ నీటి ఎద్దడి ఉన్న గ్రామాలను ముందుగానే గుర్తించాలన్నారు. సమావేశంలో పీఆర్ జేఈఈ డి. రమేష్ పాల్గొన్నారు.

సారా నియంత్రణే లక్ష్యం

రాజాం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రేగిడి, వంగర మండలాల్లోని పలుగ్రామాల్లో శనివారంఅవగాహన ప్రచార రథంతో నవోదయం 2.0 కార్యక్రమం ద్వారా సారా నియంత్రణే లక్ష్యంగా ప్రచార కార్యక్రమం చేపట్టినట్లు రాజాం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.జైభీమ్ తెలిపారు.ఈసందర్భంగా నవోదయం 2.0గురించి తెలిపే గోడ పత్రికలు అంటించి కరపత్రాలు పంపిణీచేశారు. కార్యక్రమంలో ఎస్ఐ జి.మాన్యాలు పాల్గొన్నారు

సపర్యలు చేసి.. శుభ్రం చేయించి

●మతిస్థిమితం లేని మహిళను ఆస్పత్రికి తరలించిన పోలీసులు



మతిస్థిమితం లేని మహిళకు దగ్గరుండి జుత్తు కత్తిరిస్తున్న పోలీసులు

జామి,మార్చి 29 (ఆంధ్రజ్యోతి):జామిలో మూడునెలలుగా మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న ఓ మహిళకు పోలీసులు సపర్యలు చేశారు. శనివారం జామి బజారు సెంటర్‌లో చేతికి దెబ్బలు తగిలి బాధపడుతున్న మహిళను ఎస్ఐ వీరజానార్దన్ గుర్తించారు. వెంటనే సిబ్బందిని పంపించి సపర్యలు చేయించారు.ఆ మహిళకు జుత్తుతీయించి, మహిళలతో శుభ్రంచేయించి చిరిగిపోయిన దుస్తులు మార్చి పించారు.పోలీసులు ఆమెకు మరిన్ని దుస్తులు సమకూర్చారు. అనంతరం పీహెచ్‌సీకి తీసుకువెళ్లి వైద్యపరీక్షలు చేయించారు. మెరుగైన వైద్యం కోసం విజయనగరం తీసుకెళ్లాలని అక్కడి సిబ్బంది సూచించారు.దీంతో గ్రామానికి చెందిన రంభ ఎర్ని వెంకటరమణ 108లో విజయనగరం ఆసుపత్రికి తీసుకెళ్లి చేర్పించారు.

శిష్టకరణ కార్పొరేషన్ చైర్మన్ ఉత్తరాంధ్రకే ఇవ్వాలి

రాజాం రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): శిష్టకరణ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన వారికే ఇవ్వాలని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పోలు మహంతి ఉమామహేశ్వరరావు శనివారం ఒకప్రకటనలో కోరారు. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, పార్టీ జిల్లా అధ్యక్షులు నాగార్జున, ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ తదితరులతో ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఇటీవలే కలిసి వివరించామని పేర్కొన్నారు.

ఘనంగా నూకాలమ్మ పండుగ

లక్కవరపుకోట, మార్చి 29(ఆంధ్రజ్యోతి):మండలంలోని మల్లివీడు, కల్లేపల్లి, రేగ గ్రామాల్లో నూకాలమ్మ పండగ మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఎనిమిదిరోజులపాటు అమ్మవారిఘటాలు తిరగ్గా, తొమ్మిదో రోజున అనుపోత్సవం నిర్వహించారు.ఉగాది ముందు రోజున పండగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

వృద్ధాశ్రమానికి సరుకుల వితరణ

రాజాం,మార్చి 29(ఆంధ్రజ్యోతి):రాజాంమండలంలోని కొండపేటకు చెందిన నార్త్ అమెరికాలో స్థిరనివాసం ఉన్న తెలుగు అసోసియేషన్ సభ్యులు గంధం సతీష్, ప్రసాద్ కొండంపేట వృద్ధాశ్రమానికి బాసటగా నిలిచారు.ఈ ప్రాంతంలో ఉన్న పది మంది అనాథలకు 10 కుట్టుమిషన్లు, వృద్ధాశ్రమానికి నిత్యవసర సరుకులతో పాటు, చెవుటి, మూగ పాఠశాల భవనం పాడవటంతో, ఈభవనం ఫ్లోరింగ్, సీలింగ్ ఖర్చులు, ఇద్దరు విద్యార్థులకు ట్యాబ్‌లు ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. ఈ మేరకు శనివారం రాజాంలో విశ్రాంతఉపాధ్యాయుడు రమణమూర్తి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రాజాం టౌన్ సీఐ అశోక్‌కుమార్, రూరల్ సీఐ ఉపేంద్రరావు, నగర పంచాయతీ కమిషనర్ జె.రామప్పలనాయుడు ట్యాబులు, కుట్టుమిషన్లు అందించారు.

ఇన్‌చార్జిలే దిక్కు

(7వ పేజీ తరువాయి)

పాలకొండ నగర పంచాయతీలో రెగ్యులర్ కమిషనర్‌గా విధులు నిర్వహించిన సర్వేశ్వరరావు కొద్దిరోజుల కిందట ఏసీబీకి చిక్కారు. దీంతో ఆ పోస్టు ఖాళీ అయ్యింది. ఈ క్రమంలో నగర పంచాయతీలో మేనేజర్‌గా పనిచేస్తున్న టి.జయరాంను ఎఫ్ఏసీ కమిషనర్‌గా బాధ్యతలు అప్పగించారు. రెగ్యులర్ కమిషనర్ బాధ్యతలు చేపట్టేంత వరకు ఆయన నగర పంచాయతీ పాలకవర్గంతో కలిసి అన్ని రకాల అభివృద్ధి పనులకు ఆమోదం తెలపాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రజా సమస్యలను ఏ మేరకు పరిష్కరించి.. అభివృద్ధి పనులను పరుగులు పెట్టిస్తారో వేచి చూడాల్సి ఉంది.

ముస్లింలకు ఇఫ్తార్ విందు



ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

కురుపాం, మార్చి29(ఆంధ్రజ్యోతి): స్థానిక శివ్వన్నపేటలో గల ముస్లిం సోదరులకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శనివారం సాయంత్రం జామా మసీదులో ఇఫ్తార్ విందును అందజేశారు. అలాగే ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫాను అందజేసి, శుభాంకాంక్షలు తెపారు. ముస్లింల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. టీడీపీ మండల కన్వీనర్ కేవీ కొండయ్య, తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్‌కుమార్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎవరీ వృద్ధురాలు?



పాలకొండ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెంకమ్మపేట ప్రాంతానికి చెందిన కడ్రోతు పార్వతి అనే వృద్ధురాలిని మూడు రోజుల కిందట పాలకొండ ఏరియా ఆసుపత్రిలో వదిలి వెళ్లిపోయారు. ఆచూకీ తెలిసినవారు వృద్ధురాలి కుటుంబ సభ్యులకు తెలియజేయాలని వైద్యుడు చిరంజీవి శనివారం కోరారు. సమాచారం తెలిస్తే 9440790117కు సమాచారం ఇవ్వాలన్నారు.

బాలిక అదృశ్యం



స్నేహ(ఫైల్)

కురుపాం, మార్చి29(ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీ నగర్‌కు చెందిన పట్లసింగి స్నేహ అనే బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేశామని కురుపాం ఎస్ఐ వి.నారాయణరావు తెలిపారు. స్నేహ ఈనెల 26వ తేదీ నుంచి కనిపించడం లేదని ఆమె నాన్నమ్మ రమణమ్మ శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే 9121109477 ఫోన్ నెంబరుకు తెలియజేయాలని ఆయన కోరారు.

ఒడిశా మద్యంతో వ్యక్తి అరెస్టు

కొమరాడ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా - ఒడిశా సరిహద్దు గ్రామం కూనేరు జంక్షన్ వద్ద ఒడిశా నుంచి 18 మద్యం సీసాలతో వస్తున్న వ్యక్తిని పట్టుకుని, అరెస్టు చేశామని కొమరాడ ఎస్ఐ నీలకంఠం తెలిపారు. శనివారం జరిపిన తనిఖీల్లో ఒడిశా రాష్ట్రం బందుగాం బ్లాక్‌కు చెందిన హిమరిక ప్రకాష్ 18 మద్యం సీసాలను తీసుకుని వస్తుండగా దాడి చేసి, పట్టుకున్నామని చెప్పారు. ప్రకాష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నెలాఖరులోగా పన్నులు చెల్లించాలి

పాలకొండ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులను ఈ నెల 31వ తేదీలోపు చెల్లించి 50 శాతం రాయితీ పొందాలని నగర పంచాయతీ కమిషనర్ తుమ్మి జయరాం అన్నారు. ఆయన శనివారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఈనెల 30, 31 తేదీలు సెలవు రోజులు అయినప్పటికీ ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు నగర పంచాయతీలోని క్యాష్ కౌంటర్లు ఈ తేదీల్లో తెరిచే ఉంటాయని తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి ఆన్‌లైన్‌లో చెల్లించాల్సి ఉంటుందని, దీనివల్ల అదనపు రుసుం చెల్లించాల్సిన వస్తుందని చెప్పారు.

గిరిజనుల రెవెన్యూ సమస్యలు పరిష్కరించండి

జియ్యమ్మవలస, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆర్ఫ్ స్వచ్ఛంద సంస్థ స్టేట్ కోఆర్డినేటర్ సందీప్‌కుమార్ కోరారు. శనివారం ఆయన గిరిజనులతో కలిసి స్థానిక తహసీల్దార్ ఆర్.పకీరును కలిసి పరిస్థితిని వివరించారు. రెవెన్యూ సదస్సుల్లో కొండ పోడు పట్టాలు, రెవెన్యూ భూమి, డిపట్టాల విషయంలో పలువురు గిరిజనులు దరఖాస్తు చేసుకున్న విషయం ఆయన గుర్తు చేశారు. వీటిని పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఫ్ స్వచ్ఛంద సంస్థ ఫీల్డ్ కోఆర్డినేటర్ బిడ్డిక సుగ్రీవులు, అధిక సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

నేడు ఆలయాల్లో పంచాంగ శ్రవణం

సీతంపేట రూరల్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): సీతంపేట గ్రామంలో ఉన్న టీటీడీ దేవాలయంలో ఆదివారం ఉగాది పర్వదినం సందర్భంగా ఉగాది ఆస్థానం, పంచాంగ శ్రవణం నిర్వహించనున్నట్టు ఆలయ సిబ్బంది తెలిపారు. ఉదయం 10.30గంటలకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని కోరారు. ● మక్కువ: శంబర పోలమాంబ అమ్మవారి ఆలయంలో ఉగాది పర్వదినం సందర్భంగా ఆదివారం ఉదయం పార్వతీపురానికి చెందిన పండితుడు బంకుపల్లి లక్ష్మీనారాయణశర్మతో పంచాంగ శ్రవణాన్ని నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ శనివారం తెలిపారు.

నిబంధనల ప్రకారమే ఎంపిక

● బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

జియ్యమ్మవలస, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల్లో అర్హులను నిబంధనల ప్రకారమే ఎంపిక చేస్తామని ఎంపీడీవో శంబంగి రమేష్ స్పష్టం చేశారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలానికి రూ.1కోటి 65లక్షల 50వేలు విలువతో 86 యూనిట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఇందులో రూ.2 లక్షల వరకు 60 యూనిట్లు, 2 నుంచి 3 లక్షల వరకు 19 యూనిట్లు, 3 నుంచి 5 లక్షల వరకు ఏడు యూనిట్లు మంజూరయ్యాయన్నారు. మొత్తం 398 మంది దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. వీరిలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులను గుర్తించి ఎంపిక చేస్తా మని ఆయన తెలిపారు. ● కొమరాడ: బీసీ కార్పొరేషన్ రుణాలకు లబ్ధిదా రుల ఎంపిక కార్యక్రమాన్ని శనివారం కొమరాడ మండల పరిషత్ కార్యాల యంలో నిర్వహించారు. మండల వ్యాప్తంగా 238 మంది దరఖాస్తు చేసుకో గా, 136 మంది ఇంటర్వ్యూలకు హాజరైనట్లు ఎంపీడీవో మల్లికార్జున రావు తెలిపారు.

మక్కువలో 3న..

మక్కువ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు వచ్చే నెల 3న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో డీడీ స్వరూపారాణి శనివారం తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు.

భామినిలో అధికారులు డుమ్మా

భామిని, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో శనివారం నిర్వహించిన బీసీ రుణాల లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమానికి అధికారులు డుమ్మా కొట్టారు. ఎంపీడీవో తోపాటు బ్యాంకు అధికారులు ఎవరూ లేకపోవడంతో దరఖాస్తుదారులు అవాక్కయ్యారు. ఎటువంటి సంబంధం లేని విద్యాశాఖ సిబ్బంది లబ్ధిదారుల ధ్రువపత్రాలను పరిశీలించారు. మహిళా పోలీసులు, విద్యాశాఖ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా టీడీపీ వ్యవస్థాపక దినోత్సవం

● ఎన్టీఆర్‌కు నివాళులు

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక దినోత్సవాని పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. పార్టీ వ్యవస్థాపకుడు, దివంగత నేత నందమూరి తారక రామారావు విగ్రహాలకు, చిత్ర పటాలకు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పలు చోట్ల కేక్ కట్ చేసి, వేడుకలు చేసుకున్నారు. ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. (ఆంధ్రజ్యోతి బృందం)



పార్వతీపురంటౌన్: నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్సీ జగదీష్, మాజీ ఎమ్మెల్యే చిరంజీవులు



పాలకొండ: నవగాంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి అప్పలనాయుడు ఆధ్వర్యంలో..

పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారానికి చర్యలు



అర్జీలపై విచారణ చేస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, జేసీ శోభిక

పార్వతీపురం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కర వేదికలో అందిన 22(ఏ) అర్జీలను పరిష్కరించడానికి అన్ని చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. శనివారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో పీజీఆర్ఎస్‌లో అందిన 4 ఫిర్యాదులపై విచారణ చేశారు. జేసీ శోభిక, డీఆర్వో హేమలత, జిల్లా రిజి స్ట్రార్ రామలక్ష్మి, జిల్లా సర్వే భూ రికార్డుల అధికారి లక్ష్మణరావు, తహసీల్దార్ల సమక్షంలో విచారణ చేపట్టి, సమస్యలను పరిష్కరించారు.

హెల్మెట్ తప్పనిసరి

పార్వతీపురం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధరించడం తప్పనిసరి చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రమాదాల నివారణకు పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. హెల్మెట్ వాడకం తప్పనిసరి అని, ముఖ్యంగా పట్టణం, బయట వాహనాలు నడిపేవారిపై దృష్టి సారించాలన్నారు. ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ రహదారి భద్రతపై అన్ని శాఖలు సమన్వయంతో పని చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ అంకిత సురానా, డిప్యూటీ కలెక్టర్ పి.ధర్మాచంద్రారెడ్డి, పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు, జిల్లా అటవీ శాఖాధికారి జి.ఏ.పి.ప్రసూన ఇతర అధికారులు పాల్గొన్నారు.

మాదిగలకు న్యాయం

● సంఘ ఉద్యోగుల ఫోరం ఆధ్వర్యంలో విజయోత్సవాలు

పాలకొండ, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మాదిగలకు ఇన్నాళ్లకు న్యాయం జరిగిందని మాదిగ ఉద్యోగుల ఫోరం సీనియర్ నాయకుడు యమ్మల సతీష్‌కుమార్ తెలిపారు. ఎస్సీ వర్గీకరణ కేంద్రం ఆమోదం తెలపడంతో శనివారం పాలకొండలో మాదిగ ఉద్యోగుల ఫోరం ఆధ్వర్యంలో విజయోత్సవాలు నిర్వహించారు. మందకృష్ణమాదిగ చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సతీష్‌కుమార్ మాట్లాడుతూ 2004 తర్వాత మాదిగలకు తీవ్ర అన్యాయం జరుగుతూ వచ్చిందని, అయితే కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలపడం హర్షణీయమన్నారు. రాష్ట్రం యూనిట్‌గా ఎస్సీ వర్గీకరణకు ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ ఉద్యోగుల ఫోరం రాష్ట్ర నాయకుడు అలజంగి చిన్నారావు, నియోజకవర్గ అధ్యక్షుడు లోపింటి జడ్డియ్య, ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకులు భోగి విశ్వేశ్వరరావు, గర్భాపు రమేష్, భోగి జేమ్స్, యందవ మరియదాసు, తోలేటి సీలయ్య, మాదిగ ఉద్యోగఫోరం పాలకొండ సలహాదారుడు గుత్వాల్లి లాజరస్, వర్కింగ్ ప్రెసిడెంట్ కోరటాన రవి, జనరల్ సెక్రటరీ పుట్ట భీమేశ్వరరావు, కోశాధికారి యందవ పుష్పనాథం, జిల్లా నాయకులు సార్తి మహేశ్వరరావు, కురమాన రమేష్ ఉన్నారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలి



స్థానికులతో మాట్లాడుతున్న డీఈ మధుసూదనరావు

వీరఘట్టం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచా యతీలో వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మధుసూదన రావు సిబ్బందికి ఆదేశించారు. శుక్రవారం స్థానిక మహిళ లు ఖాళీ బిందెలతో నిరసన తెలిపిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన ఆయన శనివారం దుర్గపేట ప్రాంతంలో గల కుళాయిలను పరిశీలించారు. అక్కడి మహిళలతో తాగునీటి సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. వారం రోజుల్లోగా దుర్గపేటలో నివసిస్తున్న అన్ని కుటుంబాలకు పూర్తిస్థాయిలో తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మధుసూదనరావు, ఏఈ పాపారావు, మేజర్ పంచాయతీ ఇన్‌చార్జి ఈవో కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఒడిశా దౌర్జన్యాలను అరికట్టాలి

బెలగాం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఒడిశా దౌర్జన్యం అరికట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌కు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం గంగునాయుడు మాట్లాడుతూ సాలూరు మండలం గంజాయిభద్ర పంచాయతీ ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రాంతంలో గల కొఠియా గ్రామాల్లో నివశిస్తున్న గిరిజనుల సాగు భూములపై ఒడిశా దౌర్జన్యం చేస్తోందన్నారు. దిగువ సెంబి గ్రామానికి చెందిన పలువురి గిరిజనుల సాగు భూములను లాక్కొని కంచె వేసి బెదిరింపులకు పాల్పడు తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సాలూరు, పాచిపెంట సీపీఎం మండల కార్యదర్శులు మర్రి శ్రీను, కోరాడ ఈశ్వరరావు, సీదిరి అప్పారావు, సనమ్మ, సీతమ్మ, భీమ్మ తదితరులు పాల్గొన్నారు.

మస్తర్లలో తప్పులు

● రికవరీకి ఆదేశించిన పీడీ రామచంద్రరావు

పార్వతీపురం రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి పనులపై స్టేట్ రిసోర్స్ పర్సన్ ఎస్.మాధవరావు ఆధ్వర్యంలో మండలంలోని 30 పంచాయతీల్లో సామాజిక తనిఖీలు నిర్వహించారు. రూ.22కోట్ల 29లక్షల 53వేల 383లతో చేపట్టిన వేతన చెల్లింపులు, మెటీరియల్ కాంపోనెంట్ ద్వారా చేపట్టిన రూ.3కోట్ల 83లక్షల 8254 పనులపై సామాజిక తనిఖీ సిబ్బంది తనిఖీ చేశారు. పంచాయతీ రాజ్‌తో పాటు ఐటీడీఏ ద్వారా చేపట్టిన రూ.3కోట్ల పనులను సామాజిక తనిఖీ సిబ్బంది పరిశీలించి నివేదికలను తయారు చేశారు. ఈక్రమంలో ఈనెల 12 నుంచి 28వ తేదీ వరకు సామాజిక సిబ్బంది గ్రామాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించారు. అనంతరం నివేదికను తయారు చేసి శనివారం పబ్లిక్ హీరింగ్ నిర్వహించారు. పీడీ రామచంద్రరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండలంలోని 30 పంచాయతీల్లో మస్తర్లు వేయడంలో తప్పులు ఉన్నట్టు గుర్తించారు. దీనికి సంబంధించి రికవరీలకు పీడీ ఆదేశించారు. మేట్లుతో పాటు ఫీల్డ్ అసిస్టెంట్లు మస్తర్లు వేయంలో నిర్లక్ష్యంగా ఉండడాన్ని గుర్తించి ఆగ్రహించారు. దీనికి సంబంధించి తప్పుడు మస్తర్లు వేసి చెల్లించిన సొమ్ముకు రికవరీలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వివిధ పనుల వద్ద బోర్డులు ఏర్పాటు చేయకుండా ఏర్పాటు చేసినట్టు చెల్లింపులు జరిగినట్టు గుర్తించడంతో బోర్డులు ఏర్పాటు చేయని ప్రాంతంలో దానికి సంబంధించిన సొమ్మును రికవరీ చేయాలని పీడీ ఆదేశించారు. 30 పంచాయతీల్లో రికవరీకి ఆదేశించారు. బోర్డుల కోసం చెల్లింపులు జరిగిన సొమ్మును గుర్తించి బ్యాంకు ద్వారా డీడీలు తీయాలన్నారు. దీంతో కొంతమంది ఫీల్డ్ అసిస్టెంట్లు బ్యాంకులకు వెళ్లి డీడీలు తీసి వెంటనే అధికారులకు సమర్పించిన పరిస్థితి కనిపించింది. ఎంపీపీ మజ్జి శోభారాణి, ఎంపీడీవో రమణమూర్తి, ఏపీవోలు కృష్ణారావు, నాగలక్ష్మి, రవిబాబు, జూనియర్ ఇంజనీర్లు బీవీ కృష్ణారావు, ఎస్.కూర్మారావు, బి.సోమేష్ తదితరులు పాల్గొన్నారు.



పబ్లిక్ హియరింగ్ నిర్వహిస్తున్న పీడీ రామచంద్రరావు

క్యాంపస్ ఇంటర్వ్యూలో తొమ్మిది మంది ఎంపిక

జియ్యమ్మవలస, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): చినమేరంగి గ్రామంలో ఉన్న శ్రీమతి శత్రుచర్ల శశికళాదేవి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు ఉద్యోగాల పంట పండింది. నెల రోజుల కిందట విజయనగరంలో జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూలకు తమ కళాశాల నుంచి 9మంది హాజరు కాగా, అందరూ ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ఎల్.విజయలక్ష్మి తెలిపారు. కళాశాలకు చెందిన కొండేటి షణ్ముఖరావు వీల్స్ ఇండియా లిమిటెడ్‌లో డిప్లమా ట్రైనీగా, జి.దుర్గాప్రసాద్ దొర, ఎస్.జ్ఞానానంద్ కుమార్, చప్ప లోకేష్, కొప్పర్ల ప్రభాషర్మ, యాళ్ళ మాధవలు శ్రీఎంకే ఎంబెడ్డెడ్ సొల్యూషన్స్ కంపెనీలో కేడ్ డిజైనర్లుగా, కర్రి ఇందు, బాలసింగి ఉదయ్ కిరణ్‌లను అవిఘ్న కనస్ట్రక్షన్స్ ప్రాజెక్టు కంపెనీ సైట్ సూపర్‌వైజర్లుగా, బోరాడ దినేష్ రోయల్ ఇన్‌ఫీల్డ్ కంపెనీలో డిప్లమా ట్రైనీగా ఎంపికయ్యారు. వీరికి శనివారం స్థానిక కళాశాలలో జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర చైర్మన్ రాగాల అప్పలకొండ చేతులమీదుగా ప్రిన్సిపాల్ విజయలక్ష్మి నియామక పత్రాలు అందజేశారు. సీహెచ్‌సీ చినమేరంగి వైద్యాధికారి ఆర్.కృష్ణచైతన్య, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పి.నరేష్‌బాబు, బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి నూకాలమ్మ జాతర

పాచిపెంట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పాచిపెంటలో ఆదివారం, సోమవారం స్థానిక ఆర్టీసీ సమీపంలో నూకాలమ్మ జాతర నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ జాతరకు చుట్టు పక్కల గ్రామాలతో పాటు ఒడిశా ప్రాంతం నుంచి కూడా భక్తులు తరలివెళ్తారు.

విద్యార్థి మృతిపై సమగ్ర నివేదిక ఇవ్వండి

సీతంపేట రూరల్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ పరిధిలోని దోనుబాయి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సవర చలపతి మృతిపై సమగ్ర నివేదికను అధికారులు ఇవ్వాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకర్రావు ఆదేశించారు. విద్యార్థి మృతిపై శనివారం ఆయన ఆవేదన వ్యక్తం చేస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు. మృతికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్య కోసం కుటుంబాలకు దూరంగా ఉంటు చదువుకుంటున్న విద్యార్థుల పట్ల అందరూ బాధ్యతతో వ్యవహరించాల్సి ఉందన్నారు.

వీఆర్ఏలకు పే స్కేల్ అమలు చేయాలి

బొబ్బిలి రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): వీఆర్ ఏల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీ యూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు కోరారు. ఈ మేరకు శనివారం బొబ్బిలి తహసీల్దార్ కార్యాలయం వద్ద వీఆర్ఏల దీక్షా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసం దర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్ఏలకు తెలంగా ణాలో అమలవుతున్న విధంగా పేస్కేల్ అమలు చేయాలని కోరారు. నామినీలను వీఆర్ఏలుగా గుర్తించాలని, అర్హులకు ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. ఈసందర్భంగా ఏప్రిల్ 5న నిర్వహించనున్న రాష్ట్ర సదస్సుకు ప్రతి మండలం నుంచి ఇద్దరు చొప్పున పాల్గొనాలని, ఏప్రిల్ జీతాల నుంచి సభ్యత్వానికి రూ.200 చొప్పున వసూలు చేయాలని, ఏప్రిల్ 7, 19 తేదీల్లో కొత్తగా మండల కమిటీలు ఏర్పాటు చేయా లని తీర్మానం చేశారు. బొబ్బిలి, బాడంగి, రామభద్ర పురం మండలాల వీఆర్ఏలు పాల్గొన్నారు.

గ్రావెల్ అక్రమ తవ్వకాలపై చర్యలు

బొబ్బిలి రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి శివారు వెంగళరాయ చెరువులో అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆర్ఐ రామ్ కుమార్ శనివారం సీజ్ చేశారు. స్థానికుల సమాచారం మేరకు ఆ స్థలానికి చేరుకుని, గ్రావెల్ తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేశామని చెప్పారు.

న్యూస్ బాక్స్

టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు సాయం

పార్వతీపురం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మృతిచెందిన ఇద్దరు టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర శనివారం ఆర్థిక సాయం చేశారు. మాలతిదొర, గంగునాయుడు అనే ఇద్దరు టీడీపీ కార్యకర్తలు ఇటీవల మృతిచెందారు. వారి కుటుంబాలకు ఎమ్మెల్యే చెరో రూ.25వేలు అందజేశారు. పార్టీ నాయకులు వెంకటాయుడు, బోను దేవిచంద్రమౌళి, గురజాన చంద్రమౌళి పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్లకు దుస్తుల పంపిణీ

సీతంపేట రూరల్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): సీతంపేట పంచాయతీ పరిధిలో పని చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు ఉగాది పండగ సందర్భంగా దుస్తులు పంపిణీ చేశారు. శనివారం స్థానిక సచివాలయంలో సర్పంచ్ ఆరిక కళావతి, ఎంపీడీవో కె.గీతాంజలిలు వీరికి దుస్తులు అందజేశారు. పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.

పెదపథంలో జ్వరాలు

సాలూరు రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పెదపథం పంచాయతీ కేంద్రంలో గత కొద్దిరోజులుగా పలువురు నొప్పులతో కూడిన జ్వరాలతో బాధపడుతున్నారు. జ్వరం రావడంతో పాటు ఒళ్లు నొప్పులు తీవ్రంగా బాధిస్తున్నాయి. గ్రామంలో పర్యటించి వైద్యశిబిరం నిర్వహించి బాధితులకు వైద్యసేవలు అందించినట్టు బాగువలస పీహెచ్‌సీ వైద్యాధికారి రవికిరణ్ శనివారం చెప్పారు. గ్రామంలో వైద్యసిబ్బందితో ప్రత్యేక పర్యవేక్షణ నిర్వహిస్తామన్నారు.

తోణాం పీహెచ్‌సీలో టీబీ పరీక్షలు

సాలూరు రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధి నిర్ధారణకు కొత్తగా ప్రవేశపెట్టిన సీవై టీబీ పరీక్షలను తోణాం పీహెచ్‌సీలో శనివారం నిర్వహించారు. వైద్యుడు అక్యాన అజయ్ నేతృత్వంలో ఈ పరీక్షలను నిర్వహించారు. ఈ పరీక్షల వల్ల టీబీ ఉన్నది లేనిది 48 గంటల్లో స్పష్టత వస్తుందని ఆయన తెలిపారు. టీబీ సూపర్‌వైజర్ నరేష్ పాల్గొన్నారు.

అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన చర్యలు

సాలూరు,మార్చి 29 (ఆంధ్రజ్యోతి): చిన్న పిల్లలపై ఎవరైనా అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని గజపతినగరం సివిల్ న్యాయాధికారి బి.కనకమహాలక్ష్మి అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆమె విద్యార్థులకు పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. సాలూరు జూనియర్ సివిల్ న్యాయాధికారి కె.రమేష్, పట్టణ సీఐ అప్పలనాయుడు, బార్ ప్రసిడెంట్ టి.తిరుపతిరావు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉగాది పురస్కారాలకు శ్రీరాములునాయుడు ఎంపిక

పార్వతీపురం రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సంస్కృతి విభాగం ద్వారా అందిస్తున్న ఉగాది పురస్కారాలకు మండలంలోని నర్సిపురం గ్రామానికి చెందిన బడే శ్రీరాములునాయుడు ఎంపికయ్యారు. ఆదివారం విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతులమీదుగా ఈ పురస్కారాన్ని అందుకోనున్నట్టు శ్రీరాములునాయుడు చెప్పారు. గతంలో పౌరాణిక నాటకాల్లో తన ప్రదర్శనకు గుర్తింపుగా ఈ పురస్కారం లభించినట్టు ఆయన శనివారం చెప్పారు.